RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 4, సంచిక : 37

ఆదివారం
జనవరి 11, 2026

పేజీలు : 6
వెల : రూ.3-00



4లో..

## 'పుర పోరు'కు పార్టీల సై!

- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం
- సివిల్ సప్లై వ్యవస్థను శాసిస్తున్న మాఫియా
- నిరుపేదల మెతుకుపై కోట్లు పోగేసుకుంటున్న కేటుగాళ్లు



- సరిహద్దులు దాటుతున్న క్వింటాళ్ల బియ్యం
- పంపిణీ చేయకుండానే పక్కదారి
- రూ.12కి కొని.. పాలిష్ చేసి రూ.40కి విక్రయం
- రేషన్ డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్లే అడ్డాలు
- సీఎంఆర్ పేరిట మిల్లర్ల భారీ స్కామ్
- నిఘా నీడలోనే రేషన్ బియ్యం దందా

3లో..

# రేషన్ దందా!



**వేద న్యూస్, క్రైం బ్యూరో:**

నిరుపేదల ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల సబ్సిడీ భారాన్ని మోస్తూ పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం.. ఇప్పుడు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ లక్ష్యం పేదవాడి కడుపు నింపడం అయితే, అక్రమార్కుల లక్ష్యం ఆ పేదవాడి నోటికాడ ముద్దను లాక్కొని సొమ్ము చేసుకోవడమే. దళారులు, రేషన్ డీలర్లు, రైస్ మిల్లర్లు ఒక మాఫియాగా ఏర్పడి, రేషన్ పంపిణీ వ్యవస్థను అక్షయపాత్రలా వాడుకుంటున్నారు. లబ్ధిదారుడి ఇంటికి చేరాల్సిన బియ్యం, సరిహద్దులు దాటి పక్కదారి పడుతుంటే.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదాము నుంచి రేషన్ షాపునకు, అక్కడి నుంచి పేదల ఇంటికి చేరాల్సిన బియ్యం ప్రయాణం.. ఇప్పుడు పూర్తిగా దారి తప్పింది. రికార్డుల్లో పంపిణీ పూర్తయినట్లు కాగితాలు చూపిస్తున్నా, వాస్తవంలో మాత్రం ఆ బియ్యం దళారుల వాహనాల్లో రీసైక్లింగ్ మిల్లులకు చేరుతోంది. కేవలం 12 రూపాయలకు పేదల నుంచి సేకరించిన బియ్యాన్ని, పాలిష్ చేసి 40 రూపాయలకు మార్కెట్‌లో విక్రయిస్తూ కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. అంతటితో ఆగకుండా, అదే రేషన్ బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద అప్పగిస్తూ రెట్టింపు లాభాలు గడిస్తున్న మిల్లర్ల మాయాజాలం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

## వేద న్యూస్ క్యాలెండర్ 2026 ఆవిష్కరణ



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

వేద న్యూస్ తెలుగు దినపత్రిక – 2026 క్యాలెండర్ ను ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు హింగె భాస్కర్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.58 కోట్లు కొట్టేశారు!



3లో..

# ప్రజాపక్షంగా వేద న్యూస్

- ఎల్కతుర్తి ఏఎంసీ చైర్మన్ సుకినే సంతాజీ
- అన్ని వర్గాల ఆదరణ పొందిన పత్రిక "వేద న్యూసు
- టీఆర్ఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్, హన్మకొండ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్
- వేద న్యూస్ తెలుగు దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొని..ప్రజాపక్షంగా "వేద న్యూసు తెలుగు దినపత్రిక ముందుకు కొనసాగుతున్నదని ఎల్కతుర్తి ఏఎంసీ చైర్మన్ సుకినే సంతాజీ అభినందించారు. వేద న్యూస్ తెలుగు దినపత్రిక –2026 క్యాలెండర్ ను ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేద న్యూస్ ఎడిటర్, విలేకరులు, సిబ్బందికి నూతన సంవత్సరాది, సంక్రాంతి శుభా కాంక్షలు తెలిపారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పత్రిక మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ఆదరణ పొందిన పత్రిక వేద న్యూస్ అని టీఆర్ఆర్ఎస్(తెలంగాణ రైతు రక్షణ సమితి) ఉమ్మడి కరీంనగర్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు భాస్కర్ హింగే పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఏటా వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్స్ రూపొందిస్తూ.. అందిస్తుండడం అభినందనీయమని వెల్లడించారు. పత్రికా విలేకరులు, సిబ్బంది, యాజమాన్యానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

3లో..

- హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఇండియా సదస్సులో ప్రసంగించనున్న కేటీఆర్

## మహిళా అధికారిణిపై దుష్ప్రచారం తగదు


3లో..

# ఈ రోజు రారు..రేపు రండి..!

## పెద్దస్పత్రిలో పడిగాపులు!

- ఎంజీఎంలో డాక్టర్ల నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు
- సమయానికి రారు.. ఎప్పుడు వస్తారో తెలియదు
- ఎదురు చూపులతో పేద రోగుల ఇబ్బందులు
- లక్షల్లో జీతాలు.. డ్యూటీలో మాత్రం లేని నిబద్ధత
- సీఓటీ, ఆర్థో వార్డుల్లో డాక్టర్ల ఇష్టారాజ్యం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం..!





**వేద న్యూస్, ఎంజీఎం:**

ఉత్తర తెలంగాణకు గుండెకాయ వంటిది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి వేలాది మంది పేద రోగులు తమ అనారోగ్యాన్ని చూపించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. కానీ, ఆశతో వచ్చిన రోగులకు అక్కడ నిరాశ మాత్రమే మిగులుతుంది. రోజూ వేలాది మంది రోగులు వరంగల్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాలు, గ్రామాల నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలివస్తుండగా, కొందరు వైద్యుల నిర్లక్ష్యం వారి ఆశలను నిరాశగా మారుస్తోంది. ముఖ్యంగా ఆస్పత్రిలోని సీఓటీ అండ్ ఆర్థో డ్రెస్సింగ్ వార్డ్ సెక్షన్‌లో కొందరు డాక్టర్ల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఆర్థో డ్యూటీ డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం రోగుల ఆవేదనకు కారణమవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి వేకువజామునే బయలుదేరి, గంటల తరబడి ఓపీ చీటీల కోసం లైన్లో నిలబడి, సంబంధిత వార్డుకు చేరుకున్నాక డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

**తీరా చూస్తే ఖాళీ కుర్చీ!**

ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రినే పెద్దదిక్కుగా ఆశ్రయించిన పేద రోగులు దూర ప్రాంతాల నుంచి, పల్లెల నుంచి తెల్లవారుజామునే బయలుదేరి ఎంజీఎంకు చేరుకుంటున్నారు. గంటల తరబడి లైన్లలో నిలబడి ఓపీ చీటీలు తీసుకుని, నడవలేని స్థితిలో ఆర్థో వార్డుకు వెళ్తే.. అక్కడ ఉండాల్సిన డ్యూటీ డాక్టర్లు మాత్రం కానరావడం లేదు. లక్షల్లో జీతాలు తీసుకుంటున్న డాక్టర్లు తమ విధులను విస్మరించి, సమయానికి రాకపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎముకల నొప్పులు, గాయాలతో వచ్చిన వారు గంటల తరబడి నేలపైనే కూర్చుని పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

**'ఈరోజు రారు.. రేపు రండి..' అంటూ..**

పోనీ.. డాక్టర్ ఎప్పుడు వస్తారని అక్కడి సిబ్బందిని అడిగితే.. వారు కనీస మానవత్వం లేకుండా సమాధానం చెబుతున్నారు. 'సార్లు ఈరోజు రారు.. టైమ్ అయిపోయింది.. రేపు రండి' అంటూ పొడిపొడి మాటలతో రోగులను పంపిస్తున్నారు. దూర ప్రయాణం చేసి, తినడానికి తిండి లేక, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేక వచ్చిన పేద ప్రజలు.. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అగమ్యగోచర స్థితిలో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

**ప్రైవేటు ప్రాక్టీసుల మాయాజాలమా?**

ప్రభుత్వ ఆస్పత్రిలో విధులకు ఎగనామం పెడుతున్న కొందరు డాక్టర్లు.. అదే సమయంలో ప్రైవేటు క్లినిక్కుల్లో దర్శనమిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రజల సొమ్ముతో భారీగా జీతభత్యాలు పొందుతున్న వైద్యులు, పేదలకు సేవ చేయడంలో మాత్రం ఎందుకు వెనకడుగు వేస్తున్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు, వృత్తి ధర్మానికి విరుద్ధమైన చర్య అని రోగులు, సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.

**సూపరింటెండెంట్ గారూ.. చర్యలేవి?**

ఎంజీఎంలో పరిస్థితి ఇంత అధ్వాన్నంగా మారుతున్నా.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వస్తున్నాయి. కట్టుదిట్టమైన చర్యలు ఉన్నా డాక్టర్లు ఎందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు? ఈ పరిస్థితిపై ఇకనైనా ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి, విధుల్లో ఉన్న వైద్యులు తప్పనిసరిగా సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. డ్యూటీకి రాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే రోగులతో డాక్టర్లు, సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గండ్రపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- ప్రజల సంక్షేమం కోసం పరితపించే మహా నాయకుడు
- అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం
- మాజీ ఎంపీపీ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు

**వేద న్యూస్, శాయంపేట:**

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శాయంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. తమకు ఎలాంటి సంబంధం లేని అంశాలను కావాలని తెరపైకి తెచ్చి, ప్రజల్లో అపారమైన ఆదరణ కలిగిన తమ నాయకుడు గండ్ర వెంకట రమణారెడ్డిపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేయడం అధికార పార్టీ నాయకులు మానుకోవాలని హెచ్చరించారు. మీ అంతర్గత గొడవలను మా నాయకుడిపై మోపే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సరైన సమయంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఏ పత్రికలోనూ మీ పేరు గానీ, మీ నాయకుడి పేరు గానీ ప్రస్తావన లేకపోయినా, మీరే మా నాయకుడేనని ఊహించుకొని విమర్శలు చేయడం సరికాదన్నారు. గండ్ర వెంకట రమణారెడ్డి గతంలో మన ఊరు-మన రమణన్న కార్యక్రమం నిర్వహించిన సమయంలో దళిత కుటుంబాల్లోనే నిద్రించి, ప్రజల కష్టాలను దగ్గరగా తెలుసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. శాయంపేట మండలంలో గండ్ర వెంకట రమణారెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తాయని, ప్రత్యర్థులు తట్టెడు మట్టి కూడా పోసిన



దాఖలాలు లేవని విమర్శించారు. తెరచాటున మాటల యుద్ధం చేసే నాయకుడు కాదని, నికార్సైన ప్రజాసేవే ఆయన లక్ష్యమని అన్నారు. ప్రతి పేద కుటుంబంలో పెద్దకొడుకులా నిలబడి, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యమవుతూ నిరంతరం సేవలందిస్తున్న నాయకుడు రమణారెడ్డి అని పేర్కొన్నారు. అంతేకాకుండా అనేక మంది దళిత సోదరులకు కులాంతర ప్రేమ వివాహాలకు ఆర్థిక సహాయం అందించిన వ్యక్తి గండ్ర వెంకట రమణారెడ్డి అని తెలిపారు. ఆయన సహాయంతో పదవులు అనుభవించి లబ్ధిపొందినవారే నేడు అధికార పార్టీలో చేరి లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే వాటిపై దృష్టి పెట్టకుండా, రాజకీయ గొడవల్లో మునిగిపోయి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల నాయకులు దైనంపెల్లి సుమన్, మారపల్లి నందం, విజయ్, కరణ్ బాబు, మోహన్, గాజె రాజేందర్, రంగు మహేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

- ముందస్తు అప్రమత్తతతోనే దొంగతనాలకు అడ్డుకట్ట
- అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం
- ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజలు పెద్ద సంఖ్యలో తమ స్వగ్రామాలకు ప్రయాణాలు చేస్తున్న నేపథ్యంలో దొంగతనాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సూచించారు. ప్రజల సహకారం ఉంటేనే నేరాల నివారణ సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. పండుగ వేళ ఇళ్లు ఖాళీగా ఉండే పరిస్థితిని దొంగలు ఆసరాగా తీసుకునే ప్రమాదం ఉందన్నారు. ఊర్లకు వెళ్లే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని లేదా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. చోరీలను నియంత్రించేందుకు పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలు చేపట్టిందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా లేదా కవరుతో కప్పి ఉంచాలని సూచించారు. ప్రధాన ద్వారాన్ని లోపల నుంచి లాక్ చేసి, పక్క ద్వారాలకు తాళం వేయడం మంచిదన్నారు. బంగారం, వెండి, నగదు వంటి విలువైన వస్తువులను బీరువాలో ఉం



చకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, ఆర్థిక వివరాలను ఇతరులతో పంచుకోరాదని తెలిపారు. ఇంటి చుట్టూ అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. మొబైల్‌కు నోటిఫికేషన్ వచ్చే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ఇంటి బయట నాలుగు దిక్కులా కవర్ అయ్యేలా కెమెరాలు అమర్చడం భద్రతకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇంట్లో మహిళలు లేదా వృద్ధులు ఉన్నప్పుడు అపరిచితులు సమాచారం అడుగుతూ వస్తే నమ్మవద్దని ముందుగానే అవగాహన కల్పించాలని, పక్కింటివారిని ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లాలని సూచించారు. ప్రజల అప్రమత్తతే నేరాల నియంత్రణకు ప్రధాన ఆయుధమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- ప్రమాదాల నివారణకు నియమాలు తప్పనిసరి
- విద్యార్థులే సమాజానికి మార్గదర్శకులు
- పరకాల ఏసీపి సతీష్ బాబు

**వేద న్యూస్, శాయంపేట:**

ప్రయాణాల సమయంలో రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పరకాల ఏసీపీ సతీష్ బాబు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా శాయంపేట మండలంలోని ఎంజేపీ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు వినియోగించకపోవడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమా ఓదాలను చాలా వరకు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాలను విద్యార్థులు



తమ తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, పరిసరాల్లోని వారికీ అర్థమయ్యేలా వివరించాలని ఏసీపీ సూచించారు. విద్యార్థుల అవగాహనే సమాజంలో మార్పుకు బలమైన ఆయుధమని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్వర్, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనాన్ని వెంటనే చేపట్టాలి

- ఐదేళ్లుగా నిలిచిపోయిన డిమాండ్
- బీఎస్ఎస్ అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాన్ని వెంటనే నిర్మించాలని బీఎస్ఎస్ అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్, దళిత నాయకులు అరికెల్ల దేవయ్య మాట్లాడుతూ.. దాదాపు ఐదేళ్ల క్రితమే అంబేద్కర్ భవనం కోసం పశువుల దవాఖాన ముందు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని శుభ్రం చేసి, ముళ్ల కంచెలు, చెట్లను తొలగించి ఎంతో శ్రమతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అప్పటి నుంచే అదే స్థలంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అప్పటి ఎమ్మెల్యేకు అనేకసార్లు భవన నిర్మాణం విషయమై వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణ రావుకు దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సాక్షిగా రూ.50 లక్షలతో అంబేద్కర్ భవనం నిర్మించాలని విన్నవించామని తెలిపారు. ఈ ప్రతిపాదనకు అప్పట్లో ఎమ్మెల్యే స్పందించి, తహసీల్దార్‌కు కూడా సూచనలు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని, ఏప్రిల్ 14 నాటికి అంబేద్కర్ భవనంలోనే జయంతి కార్యక్రమం నిర్వహించుకునేలా పనులు వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోగ్గం సుమన్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి విజయ్, మండల అధ్యక్షులు మారపెల్లి సుధాకర్, దళిత నాయకులు మొగిలి, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని అంబం (ఆర్) గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో ఏవైనా విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలు తెలియజేస్తే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్, ఉప సర్పంచ్ రేపల్లి సాయిప్రసాద్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

- ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తప్పవు
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- జిల్లావ్యాప్తంగా రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లావ్యాప్తంగా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలి కలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రౌడీ షీట్స్, హిస్టరీ షీట్స్ ఉన్న వ్యక్తుల ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలపై ఆరా తీసిన పోలీసులు వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేరాలకు దూరంగా ఉండి, సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. నేరాలకు దూరంగా ఉండి, సత్ప్రవర్తనతో మెలిగే వారిని గుర్తించి వారి షీట్లను తొలగించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ అధికారులు సూచించిన సమయాల్లో తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తే బైండోవర్ వంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, నేరానికి పాల్పడిన వారు ఎంతటివారైనా చట్టం ముందు సమానమేనని, ఎలాంటి ఉపేక్ష ఉండదని జిల్లా ఎస్పీ తేల్చిచెప్పారు.

# దుబ్బ రాజన్న జాతర పోస్టర్ ఆవిష్కరణ

- ఈ నెల 17, 18 తేదీల్లో జాతర

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ దుబ్బ రాజన్న స్వామి జాతర పోస్టర్‌ను రమాదేవి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న స్వామి జాతరకు సంబంధించిన పోస్టర్‌ను గ్రామస్తులు, జాతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ.. గ్రామ దేవత ఆశీస్సులతో జాతరను సంప్రదాయబద్ధంగా, శాంతియుత వాతావరణం లో నిర్వహించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాతర కమిటీ సభ్యులకు సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జాతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# ఓసీల సింహగర్జనను విజయవంతం చేద్దాం

- కృషి రత్న బుస్స శ్రీనివాస్ పిలుపు

**వేద న్యూస్, వేములవాడ :**



నేడు (ఆదివారం)వరంగల్ ఆర్ట్స్ కళాశాలలో లక్ష మందితో నిర్వహించే ఓసీ సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు కృషి రత్న బుస్స శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొందరు అసత్యప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఓసీలంతా ఐక్యమై హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఓసీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీచేయాలని డిమాండ్ చేశారు. ఓసీల సింహగర్జన సమరభేరి సభను విజయవంతం చేసి ఆర్యవైశ్యుల ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని ఆయన కోరారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ

- శాత్రాజుపల్లి వద్ద రహదారి మూసివేత
- వేములవాడ-జగిత్యాల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిపివేత

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వేములవాడ-జగిత్యాల ప్రధాన రహదారిపై రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. లీకేజీ మరమ్మతుల నేపథ్యంలో వేములవాడ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలను చెక్కపల్లి-ఎదురుగట్ల-నూకలమర్రి మార్గం గుండా మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే వేములవాడలో రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, జగిత్యాల వైపు ప్రయాణించే వారు నూకలమర్రి రహదారిని ఉపయోగించాలని సూచించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రయాణికులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం
- సివిల్ సప్లై వ్యవస్థను శాసిస్తున్న మాఫియా
- నిరుపేదల మెతుకుపై కోట్లు పోగేసుకుంటున్న కేటుగాళ్లు

- సరిహద్దులు దాటుతున్న క్వింటాళ్ల బియ్యం
- పంపిణీ చేయకుండానే పక్కదారి
- రూ.12కి కొని.. పాలిష్ చేసి రూ.40కి విక్రయం
- రేషన్ డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్లే అడ్డాలు
- సీఎంఆర్ పేరిట మిల్లర్ల భారీ స్కామ్
- నిఘా నీడలోనే రేషన్ బియ్యం దందా

# రేషన్ దందా!



**వేద న్యూస్, క్రైం బ్యూరో:**

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం.. అదే పేదల కడుపు కొట్టే వ్యాపారంగా మారుతోంది. కోట్లాది రూపాయల సబ్సిడీతో అందిస్తున్న రేషన్ బియ్యం పథకం అక్రమార్కులకు అక్షయపాత్రలా మారింది. లబ్ధిదారుల చేతికి చేరాల్సిన బియ్యం.. దళారులు, రేషన్ డీలర్లు, మిల్లర్ల కుమ్మక్కుతో బహిరంగ మార్కెట్కు తరలిపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న అక్రమాలు ఇప్పుడు అనేకంగా వెలుగుచూస్తున్నాయి. ఈ దందా వ్యవస్థాగత మాఫియా నెట్వర్క్గా మారాయని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. లబ్ధిదారుడి చేతికి చేరాల్సిన బియ్యం గ్రామాలే దాటకుండానే దళారుల గోదాముల్లోకి చేరుతోంది. కొన్ని చోట్ల పంపిణీకి ముందే బియ్యం మాయం అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో గోదాముల నుంచే నేరుగా అక్రమ మార్కెట్కు తరలిపోతోంది. సాధా రణంగా రేషన్ బియ్యం ప్రయాణం గోదాం నుంచి రేషన్ షాప్కు, అక్కడి నుంచి లబ్ధిదారుడి ఇంటికి చేరాలి. కానీ వాస్తవంలో మాత్రం ఈ ప్రయాణం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు చాలా చోట్ల గోదాం నుంచి రేషన్ షాప్కు చేరిన బియ్యం, లబ్ధిదారుడికి చేరే లోపే దళారుల వాహనాల్లోకి ఎక్కుతోంది. రికార్డుల్లో మాత్రం పంపిణీ పూర్తయింది అని చూపిస్తున్నారు. కాగి తాల మీద పేదలకు బియ్యం చేరినట్టే లెక్కలు చూపుతున్నారు. కానీ వాస్తవంలో మాత్రం బియ్యం మార్కెట్లో అమ్ముడవుతోంది.

**- రూ. కోట్లలో దందా**

ఈ అక్రమ వ్యవహారానికి కేంద్ర బిందువుగా మారింది రేషన్ డీలర్-దళారి కుమ్మక్కు. గ్రామాల్లోని పేద, వృద్ధ లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని డీలర్లు కొత్త పద్ధతిని అమలు చేస్తున్నారు. 'బియ్యం తీసుకుంటే ఇబ్బంది.. డబ్బులే తీసుకోండి' అంటూ నెలకు రూ.300 నుంచి రూ.500 వరకు చేతిలో పెట్టి, వారి పేరుతో వచ్చే మొత్తం రేషన్ బియ్యాన్ని తమ వద్దే ఉంచుకుంటున్నారు. మరికొన్ని చోట్ల లబ్ధిదారుల నుంచి ఒక్కో కిలో బియ్యాన్ని రూ.12 నుంచి రూ.14కు సేకరిస్తున్నారు. పేదలకు ఇది అప్పటి అవసరానికి ఉపశమనంగా కనిపించినా, అసలు నష్టం అక్కడే మొదలవుతోంది. ఈ విధంగా సేకరించిన బియ్యం దళారుల చేతికి చేరుతుంది. అక్కడ నుంచి అదే బియ్యం మార్కె ట్లో రూ.35 నుంచి రూ.40 ధరకు విక్రయ మవుతోంది. అంటే ఒక కిలోపై రూ.20కి పైగా లాభం. వందల క్వింటాళ్ల లెక్కన చూసుకుంటే ఇది లక్షలు కాదు.. కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం. ఈ మొత్తం వ్యవహారంలో డీలర్కు కమీషన్, దళారికి భారీ లాభం. కానీ పేద కుటుంబం మాత్రం తనకు రావాల్సిన ఆహార భద్రతను కోల్పోతోంది.

**- గోదాముల నుంచి దళారుల వాహనాల్లోకి..**

కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. అక్కడ లబ్ధిదారుడి పాత్రే లేకుండా పోయింది. రేషన్ షాప్కు బియ్యం రాగానే బిల్లులు తయారు చేసి, నేరుగా దళారుల వాహనాల్లోకి ఎక్కిస్తున్నారు. అంటే పేదల పేరుతో వచ్చిన బియ్యం, పేదల ముఖం కూడా చూడకుండా బయటకు వెళ్లిపోతోంది. ఇది కేవలం డీలర్ స్థాయిలో జరిగే అక్రమమా? లేక దీనికి పై స్థాయి వారు అండగా ఉన్నారా? అన్న అనుమానాలు సహజంగానే తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల ఈ అక్రమం రేషన్ షాప్లను కూడా దాటేసి, గోదాముల స్థాయికే చేరింది. ప్రభుత్వ గోదాముల నుంచే బియ్యం అక్రమంగా బయటకు వెళ్లుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రివేళల్లో వాహనాలపై లోడింగ్, సరిహద్దులు దాటి రవాణా.. ఇవన్నీ స్థానిక స్థాయిలో జరిగే పనులు కావని, ఇందులో పెద్ద స్థాయి నెట్వర్క్ పని చేస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థాయిలో బియ్యం తరలిపోతున్నప్పుడు, సంబం ధిత అధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.



**- సీఎంఆర్ పేరిట భారీ స్కామ్..**

అక్రమార్కులైన కొందరు మిల్లర్లు రేషన్ బియ్యాన్నే మళ్లీ ప్రభుత్వానికి అప్పగిస్తూ రెట్టింపు లాభం పొందుతున్నారు. దళారుల నుంచి తక్కువ ధరకు కొన్న రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. అంటే ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన బియ్యాన్నే మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అమ్ముతూ ప్రజా ధనాన్ని దర్జాగా కొల్లగొడుతున్నారు. ఈ ప్రక్రియలో అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం.

**- సివిల్ సప్లై ఏం చేస్తోంది?**

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆందోళన కలిగించే విషయం సివిల్ సప్లై అధికారుల పాత్ర. గ్రామాల్లో, మండలాల్లో, జిల్లాల్లో జరుగుతున్న ఈ అక్రమాలు వారికి తెలియకుండా జరుగుతున్నాయా? లేక తెలిసీ మౌనం పాటిస్తున్నారా? అనే సందేహాలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. అధికారుల అండ లేకుండా ఇంత విస్తృతంగా, నిర్భయంగా రేషన్ మాఫియా పనిచేయడం సాధ్యమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**- ఎన్ఫోర్స్మెంట్ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు..**

ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఎన్ఫోర్స్మెంట్ శాఖ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రేషన్ డీలర్ల అసలు రంగు బయ టపడింది. అనేక రేషన్ షాపుల్లో స్టాక్ రికార్డులకు, ఉన్న నిల్వలకు పొంతన లేకపోవడం అధికారులను విస్మయానికి గురిచేసింది. పట్టుబడిన బియ్యం నిల్వలు, వాహనాల ద్వారా ఈ దందా ఏ స్థాయిలో సాగుతోందో అర్థమవుతోంది. పట్టుబడుతున్నా శిక్షలు కఠినంగా లేకపోవడం, అధికారుల సహకారం ఉండటంతో అక్రమా ర్కులు ఏమాత్రం భయం లేకుండా దందాను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ బియ్యం మాఫియాపై ఉక్కు పాదం మోపాలని, పేదల మెతుకు పక్కదారి పట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# రూ.2.58 కోట్లు కొట్టేశారు!

- సైబర్ నేరగాళ్ల నయా ప్లాన్
- స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో గాలం
- మోసపోయిన మాజీ ఐపీఎస్ అధికారి భార్య
- నకిలీ సెబి సర్టిఫికెట్లతో నమ్మకం కల్పించిన ముఠా
- హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మాజీ ఐపీఎస్ అధికారి భార్యను మోసం చేసి రూ.2.58 కోట్లను కాజేసిన ఘటన హైదరాబాద్లో వెలుగుచూసింది. వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాలను నమ్మిన బాధితురాలు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చిట్కాలు అందిస్తామని వాట్సాప్లో వచ్చిన మెసేజ్ల ఆధారంగా బాధితురాలు సంబంధిత ట్రేడింగ్ గ్రూప్లో చేరినట్లు వెల్లడైంది. ఆ గ్రూప్లో 500 శాతం వరకు లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడి వేదిక సెబి ధృవీకరణ పొందిందని చెబుతూ నకిలీ సెబి సర్టిఫికెట్లను వాట్సాప్లో పంపి నమ్మకం కల్పించారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 5 వరకు మొత్తం 19 లావాదేవీల ద్వారా రూ.2.58 కోట్లను పెట్టుబడిగా చెల్లింపులు చేయించినట్లు పోలీసులు గుర్తించారు. ఒక దశలో పెట్టుబడులు నిలిపివేయగా, మరింత డబ్బు పెట్టకపోతే ఇప్పటివరకు పెట్టిన మొత్తం అంతా పోతుందని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మోసాన్ని గుర్తించిన అనంతరం బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వాట్సాప్ గ్రూప్ల ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని, ఇలాంటి హామీలు ఎక్కువగా మోసాలేనని సైబర్ క్రైం పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.

# నిషేధిత చైనా మాంజపై అవగాహన

**వేద న్యూస్, రుద్రూర్ :**



నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం వద్ద దుకాణాల సముదాయ యజమానులతో శనివారం రుద్రూర్ ఎస్సై సాయన్న నిషేధిత చైనా మాంజ పై అవగాహన కల్పించారు. చైనా మాంజ వలన మానవులకు, పక్షులకు హాని జరుగుతుందన్నారు. చైనా మాంజ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# మహిళా అధికారిణిపై దుష్ప్రచారం తగదు

- వాస్తవాలతోనే వార్తలు రాయాలి
- కుటుంబాలను ఇబ్బంది పెట్టొద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్లో మీడియాతో మాట్లాడుతూ.. ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా కథనాలు రాయడం సరికాదని హితవు పలికారు. నల్గొండ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రక్రియ మంత్రులు, ఎమ్మెల్యేలకు ముందుగా తెలియకుండానే జరిగే సందర్భాలు ఉంటాయని చెప్పారు. అధికారులపై ఆధారంలేని ఆరోపణలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. సంచలనాల కోసం కాకుండా వాస్తవాల ఆధారంగా మాత్రమే వార్తలు రాయాలని మీడియాను కోరారు. చానళ్ల మధ్య పోటీ కోసం అధికారులను, ముఖ్యంగా మహిళా అధికారులను ఇబ్బంది పెట్టడం తగదని ఆయన అన్నారు. కేవలం మంత్రులపైనే కాకుండా ముఖ్యమంత్రిపై కూడా దుష్ప్రచారం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే మీడియా బాధ్యత అని, గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

# కేటీఆర్కు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

- హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఇండియా సదస్సులో ప్రసంగించనున్న కేటీఆర్
- తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంపై ప్రపంచ వేదికలో చర్చ
- ఫిబ్రవరి 14, 15 తేదీల్లో సదస్సు నిర్వహణ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా పనిచేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి కేటీఆర్ కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం లభించింది. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న 23వ ఇండియా సదస్సులో ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు కేటీఆర్ను ఆహ్వానించారు. "మన ఊహించుకుంటున్న భారతు అనే భావనతో ఈ సదస్సును ఫిబ్రవరి 14, 15 తేదీల్లో హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ వేదికపై తెలంగాణ అభివృద్ధి నమూనా, పరిపాలనలో సాంకేతిక వినియోగం, పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై కేటీఆర్ ప్రసంగించనున్నారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ప్రగతిని వివరించిన కేటీఆర్, ఈ సదస్సు ద్వారా భారత్ భవిష్యత్ దిశ, యువత పాత్ర, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలను ప్రపంచ మేధావులతో పంచుకోనున్నారు. ఇది తెలంగాణకు మరోసారి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చే అవకాశంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ఇండియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక వేదికపై కేటీఆర్కు లభించిన ఆహ్వానం తెలంగాణ అభివృద్ధి ప్రయాణానికి ప్రపంచ స్థాయిలో లభించిన గౌరవంగా భావిస్తున్నారు.

# ప్రగతి పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**వేద న్యూస్, ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని స్థానిక ప్రగతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు వంటకాలు ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతియేటా విభిన్న కార్యక్రమాలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో భాగంగా ఈ సంవత్సరం ఫుడ్ ఫెస్టివల్‌ను చిన్నారులు నోరూరించే రుచులతో వంటలు చేశారు. తల్లిదండ్రుల సహకారంతో చేసిన ఈ వంటకాలను దాదాపు వంద రకాల పిండివంటలు స్కూల్‌లో ప్రదర్శించగా.టీచర్లు వారిని అభినందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలను తెలియజేసేందుకు ఈ ఫెస్ట్ దోహదపడిరదని స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఇచ్చోడా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జెలై జకు ఉపసర్పంచ్ లోక శిరీష్ రెడ్డి,మాజీ ఎంపిపి నిమ్మల ప్రితం రెడ్డి మాజీ ఎంపిటిసి నిమ్మల శివారెడ్డి హాజరుయ్యారు. వారు ఈ సందర్బంగా మాట్లాడుతూ ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాల పట్ల పిల్లలకు అవగాహనా ఈ కార్యక్రమం తోడ్పదుతుందని అన్నారు. చదువు, విలువలతో పాటు ప్రతియేటా ఏదొక శాస్త్రీయ దృక్పథంతో కూడిన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విద్యార్థులను



చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నారాని వాటికీ టీచర్లు, సిబ్బంది సహకారం కూడా ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వనమాల- వెంకట్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ కాసారం ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ ఏనుగు మంజుల, నిజాముద్దీన్, రాధ, కావేరి, ఆసన, సునీత, నందిని, కావేరి, లాస్య, రమ్య,గంగోత్రి, అక్షయా, సృజన, లక్ష్మీ, సంజన, సవిత,రచన, స్వాతి,రాజు, పాఠశాల పి ఈ టి అల్లం సాయికిరణ్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా న్యూ బిగ్ మార్ట ప్రారంభం

- జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ చేతుల మీదుగా..
- న్యూ ఇయర్ సంక్రాంతి ధమాకా సేల్ లో.. భాగంగా ప్రతి వస్తువుకు డిస్కౌంట్







**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు శుభవార్త..జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి సర్కిల్ లో శనివారం న్యూ బిగ్ మార్ట్ ఘనంగా ప్రారంభమైంది. జమ్మికుంట పట్టణ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎస్. రామకృష్ణ, కోరపల్లి సర్పంచ్ కందికట్ల మధుసూదన్, ఉప సర్పంచ్ రాజు బిగ్ మార్ట్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. జమ్మికుంట పట్టణ సీఐ రిబ్బన్ కట్ చేసి న్యూ బిగ్ మార్ట్ ను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి.. షాపును కలియతిరిగి పరిశీలించారు. న్యూ ఇయర్ సంక్రాంతి ధమాకా సేల్ లో భాగంగా ప్రతి వస్తువుపై ఖచ్చితమైన డిస్కౌంట్ ను వినియోగదారులకు ఇవ్వనున్నట్లు న్యూ బిగ్ మార్ట్ నిర్వాహకులు కొండి రమేష్, కొండి శ్రీధర్ వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు.. సిఐ రామకృష్ణ గౌడ్ ను శాలువా తో ఘనంగా సన్మానించి.. సర్కిల్ ఇన్ స్పెక్టర్ కి గిఫ్ట్ అందజేశారు. జమ్మికుంట పట్టణంలో ని ఐదు కిలోమీటర్ల పరిధిలో వినియోగదారులకు ఫ్రీ డెలివరీ ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. షాపింగ్ రంగంలో 20 ఏళ్ల విశేష అనుభవం కలిగిన కొండి రమేష్, కొండి శ్రీధర్ ..లు న్యూ బిగ్ మార్ట్ సేవలతో ప్రజలకు మరింత దగ్గరై వృద్ధిలోకి రావాలని ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులు ఆకాంక్షించారు.

# విచ్చలవిడిగా రాజకీయ ఫ్లెక్సీలు!

- దేవాలయాలు, కరెంట్ స్తంభాలపై ఏర్పాటు
- అయినా పట్టించుకోని అధికారులు
- మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంపై విమర్శలు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల పట్టణంలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు దేవాలయాలు, కరెంట్ స్తంభాలు, రోడ్ల అంచుల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేయబడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోజుల తరబడి అలాగే ఉండటంతో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరో పిస్తున్నారు. ఇరుకు రోడ్లపై పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు, పాదచారులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దేవాలయాలకు సంబంధించిన ప్రదేశాల్లో ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఫ్లెక్సీలు కడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిపై సిరిసిల్ల మున్సిపాలిటీ అధికారులు, ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బీవై నగర్, సుందరయ్య నగర్, గణేష్ నగర్, శివనగర్‌తో పాటు సిరిసిల్ల పట్టణవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అన్ని ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. పట్టణ సౌందర్యం, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఫ్లెక్సీల ఏర్పాటుపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షణ పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సహస్ర సంకల్పయాత్ర విజయవంతం కావాలని..

- సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న బీజేపీ నాయకులు




**వేద న్యూస్, బోయినిపల్లి:**

సోమనాథ్ క్షేత్రంలో నిర్వహించనున్న సహస్ర సంకల్పయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో గల అతి పురాతన త్రిలింగ సంగమేశ్వర శివాలయంలో ఓంకార జపం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేడు సోమనాథ్ క్షేత్రంలో సహస్ర సంకల్పయాత్రను ప్రారంభించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమనాథ్ స్వాభిమాన పర్వ్ భారతదేశ ఆత్మగౌరవం, అచంచల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. చరిత్రలో ఎన్నో దాడులు జరిగినా భారతీయ సంస్కృతి, విశ్వాసం ఎప్పటికీ నిలిచిపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుంకపాక చక్రవర్తి, మారం ఉపేందర్, పసికంటి వెంకటేశం, ముసుకు విజయేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల పుడితే రూ.5,116 అందజేత

- గుమ్లాపూర్‌లో మహాలక్ష్మి పథకం అమలు



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామపంచాయితీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సర్పంచ్ అయిన తర్వాత నెరవేర్చారు. ఎన్నికల సమయంలో ఆడపిల్ల పుడితే ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చిన గుమ్లాపూర్ గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్ మాట నిలబెట్టుకున్నారు. మహాలక్ష్మి పథకం కింద సర్పంచ్, ఉపసర్పంచ్ ఇంకొండ రమణారెడ్డి, వార్డు సభ్యులతో కలిసి మండల కిషన్-వేదాన్ని దంపతులకు కూతురు పుట్టిన శుభ సందర్భం గా రూ.5,116 నగదు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేయడంపై శిశువు తల్లిదండ్రులు, గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తిరుపతి, కోలాపురి శ్రీనివాస్, మండల సాగర్, పల్లపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే సంపద



– డాక్టర్ రాజశేఖర్

**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**

నేటి ఆధునిక సమాజంలో ఆరోగ్యం ఉన్న వ్యక్తి కోటీశ్వరుడితో సమానమని వైద్యుడు రాజశేఖర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని అర్జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని శానాగర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రాజశేఖర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదిం చాలని, కనీసం ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్యులు హరిత, అవినాష్ పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజా అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# భూభారతి రిజిస్ట్రేషన్ అక్రమాలు..



**హైదరాబాద్ వేద న్యూస్ :**

భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలపై విచారణకు లోకాయుక్త ఆదేశించింది. సుమోటోగా కేసు నమోదు చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. భూభారతి చట్టాన్ని వాడుకుని ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. జనగామ జిల్లా కేంద్రంలో ఒకే రోజు రూ.8 లక్షల రూపాయల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పక్కదారి పట్టించిన ఘటన బయటకు రావడంతో లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది.

# ‘పుర పోరు’కు పార్టీల సై!

- ఎన్నికల్లో పట్టు కోసం వ్యూహాలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ




**వేద న్యూస్, నర్సాపూర్:**

పురపాలిక ఎన్నికలు సమీపిస్తుండటంతో నర్సాపూర్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత జరుగుతున్న రెండో ఎన్నిక కావడంతో పోటీ మరింత ఉత్కంఠగా మారింది. ముసాయిదా ఓటరు జాబితా విడుదల కాగా, తుది జాబితా ఈ నెల 10న వెలువడనుంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీల ఆశావహులు టిక్కెట్ల కోసం పావులు కదుపుతున్నారు. మొదటి ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పట్టు సాధించగా, ఈసారి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీని హస్తగతం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మరోవైపు భారతీయ జనతా పార్టీ కూడా బలంగా పట్టు సాధించేందుకు వ్యూహాలు రచిస్తోంది.

**కలిసి సాగేనా కాంగ్రెస్?**

ఇటీవలి వరకు కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం లోపించినా, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజిరెడ్డి ప్రారంభించిన నమస్తే నర్సాపూర్ కార్యక్రమం పార్టీ అభ్యంతరాలతో నిలిచిపోయింది. అయితే డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి కలిసి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆరోగ్య కారణాలతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చురుగ్గా లేకపోయినా శుక్రవారం నిర్వహించిన సంయుక్త సమావేశం కొంత ఊరటనిచ్చింది.

**ఎమ్మెల్యేకు ప్రతిష్ఠాత్మకం**

నియోజకవర్గంలోని ఏకైక పురపాలిక కావడంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందగా, అప్పటి చైర్మన్ మురళీయాదవ్ పార్టీ మార్పులతో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనంతరం అవిశ్వాసం నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన అశోక్‌గౌడ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**పట్టు కోసం బీజేపీ ప్రయత్నాలు**

గత ఎన్నికల్లో నాలుగు వార్డుల్లో బీజేపీ గెలిచింది. ఆ తర్వాత పార్టీల మార్పులతో సమీకరణాలు మారాయి. ఈసారి మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మురళీయాదవ్ కాషాయ జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో వార్డుల వారీగా పర్యటిస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక దృష్టి సారించగా, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ కూడా వ్యూహాలు అమలు చేస్తున్నారు.

# నిరుపయోగంగా మారిన మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్

- చెత్త కుప్పలుగా మారిన ఆవరణ
- ప్రజా నిధుల దుర్వినియోగంపై స్థానికుల ఆందోళన



**వేద న్యూస్, మడికొండ:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండ 46వ డివిజన్‌లో బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో నిర్మించిన మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది. నిర్మాణం పూర్తైనప్పటి నుంచి ఈ కమ్యూనిటీ హాల్‌ను ప్రజల వినియోగానికి తీసుకురాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్-19 సమయంలో టీకాల పంపిణీకి మాత్రమే తాత్కాలికంగా ఉపయోగించిన ఈ భవనం, ప్రస్తుతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుభ్రత లేకుండా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఆవరణ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందని, దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతోందని కూడా ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజా నిధులతో నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉండటం వెనుక కారణాలేమిటోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి కమ్యూనిటీ హాల్‌ను శుభ్రపరిచి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

వేద న్యూస్

ఆదివారం జనవరి 11, 2026

# ముందస్తు సంక్రాంతి సంబరాలు

- ముగ్గులు, బోగి మంటలతో పండగ వాతావరణం
- విద్యార్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్న తల్లిదండ్రులు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు తమ తల్లులతో కలిసి రంగురంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు బోగి మంటలు, పతంగులు ఎగురవేసి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. హరిదాసు వేషధారణతో పాటు సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు పాల్గొనడంతో పాఠశాల ఆవరణంతా పండుగ సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తోట రమేష్, ఉపసర్పంచ్ గుంటి పుష్ప ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సంబరాల్లో సింగని మారుతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను చాటిచెప్పారు.

# వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

- మర్రిగడ్డలో పట్టపగలే దొంగతనం

**వేద న్యూస్, చందుర్తి:**



ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని దుండగులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించి పరారైన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పరిధిలోని మర్రిగడ్డ గ్రామంలో పట్టపగలే చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శంకరయ్య తల్లి ఆరోగ్యం బాగాలేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చందుర్తి ఎస్సై జె. రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు కీలక ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారు.

# అంగన్వాడీ కేంద్రానికి కొత్త వెలుగు

- సమస్యపై సత్వర స్పందన.. 15 రోజుల్లోనే పరిష్కారం
- మాట నిలుపుకున్న కమలాపూర్ ఏడీఈ వంశీకృష్ణ

**వేద న్యూస్, కమలాపూర్:**




కొన్ని సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల విద్యుత్ సరఫరా లేక హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు చీకట్లోనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ఇటీవల కమలాపూర్ విద్యుత్ శాఖ ఏడీఈ వంశీకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన అంగన్వాడీ కేంద్రాన్ని స్వయంగా సందర్శించి సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. 15 రోజుల్లో విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చిన ఏడీఈ, ఇచ్చిన మాట ప్రకారం అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించి ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. తన దృష్టికి వచ్చిన సమస్యను అతి తక్కువ సమయంలోనే పరిష్కరించి విధుల పట్ల తన నిబద్ధతను చాటుకున్న ఏడీఈ వంశీకృష్ణపై అంగన్వాడీ టీచర్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను తక్షణమే స్పందించి తీర్చినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించే గుణం, పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే తీరుపై స్థానికులు, అంగన్వాడీ సిబ్బంది ఏడీఈ వంశీకృష్ణకు ప్రశంసలు కురిపించారు.

# మందమర్రి ఏరియాను సందర్శించిన సింగరేణి డైరెక్టర్

- కేకే ఉపరితల గనిలో రైల్వే సైడింగ్ పనుల పరిశీలన

**వేద న్యూస్, మందమర్రి:**



సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు శనివారం మందమర్రి ఏరియాను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి ఏరియాలోని కేకే ఉపరితల గనిలో జరుగుతున్న రైల్వే సైడింగ్ పనుల స్థలాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావం తో కృషి చేయాలని సూచిం చారు. సమిష్టి ప్రయత్నాలు, నిబద్ధతతో పనిచేస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం జీఎల్. ప్రసాద్, సివిల్ ఎస్వీఈ శ్రీధర్, ఏరియా సర్వే అధికారి దేశాయితో పాటు సివిల్ అధికారులు పాల్గొన్నారు.

# పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను రుద్రూర్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్ శనివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన వారిలో పార్వతి శేఖర్, శ్రీను, పార్వతి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# 'మాంటిస్సోరి'లో ముందస్తు సంక్రాంతి

- రంగవల్లికలు, గాలిపటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాఠశాల ఆవరణ మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. రంగురంగుల రంగవల్లికలు, విద్యార్థుల కేరింతలు, గాలిపటాల సందడి పాఠశాల ప్రాంగణాన్ని ఉత్సాహంతో నింపాయి. మహిళల కోసం ప్రత్యేకంగా రంగవల్లికల పోటీలు నిర్వహించగా, చిన్నారులు ఆకాశంలోకి రంగురంగుల గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పోలు శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించామని తెలిపారు. భారతీయ సాంస్కృతిక విలువల గొప్పతనాన్ని రాబోయే తరాలకు చేరవేయాల్సిన బాధ్యత మన అందరిదేనని పేర్కొన్నారు. సంక్రాంతి వేడుకలలో భాగంగా విద్యార్థులతో వివిధ వేషధారణలు చేయించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పత్రికా రంగానికి టీకే లక్ష్మణరావు సేవలు మరువలేనివి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు

**వేద న్యూస్, మంచిర్యాల:**



పత్రికా రంగానికి, జర్నలిస్టులకు టీకే లక్ష్మణరావు అందించిన సేవలు మరువలేనివని టీడబ్ల్యూజేఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాక్రో కామ్ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో నాయకులతో కలిసి టీకే. లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి మధు మాట్లాడుతూ. .ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మణరావు నాలుగు దశాబ్దాల పాటు పలు ప్రధాన పత్రికల్లో సేవలందించారని తెలిపారు. అలాగే జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని, పత్రికా రంగానికి ఆయన చేసిన కృషిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సబ్బని భాస్కర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్. శ్రీనాథ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మడ్డి వేణుగోపాల్, సభ్యులు నెల్లూరు శ్రీనాథ్, దాసరి సుధాకర్, వలస మణిరాజ్, నౌండ్ల సతీష్, కొడం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# 'భగీరథ' పనుల్లో అక్రమాలు?

- కొత్త పైపులు దాచిపెట్టి పాతవే వినియోగం
- ప్రజా సొమ్ము దుర్వినియోగంపై గ్రామస్తుల ఆగ్రహం
- అధికార దుర్వినియోగంతో బెదిరిస్తున్నారని ఆరోపణలు

**వేద న్యూస్, ముస్తాబాద్:**



మిషన్ భగీరథ తాగునీటి పనుల్లో తీవ్ర అక్రమాలు జరిగాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం గ్రామానికి తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ ద్వారా కొత్త పైపులు సరఫరా చేసినప్పటికీ, వాటిని పూర్తిగా వినియోగించకుండా పాత పైపులనే పనుల్లో ఉపయోగించారని చెబుతున్నారు. అదేవిధంగా మిగిలిన కొత్త పైపులను రహస్యంగా ఒక ప్రైవేటు స్థలంలో దాచిపెట్టారని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు భాగస్వాములై ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న గ్రామ ప్రజలను అధికారులు, సంబంధిత వ్యక్తులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బెదిరిస్తున్నారని, నిజాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజా సొమ్ము దుర్వినియోగానికి సంబంధించిన తీవ్రమైన అంశమని పేర్కొంటూ, ఈ వ్యవహారంలో అక్రమంగా లాభాలు పొందిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అధికార దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు.

# ఆరుగురు జూదరుల అరెస్ట్

- రూ.31,433 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**



హెడ్ అండ్ టెయిల్ జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కోత్తపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని అనంతపద్మనాభస్వామి ఆలయం సమీపంలో జరిగింది. జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల ప్రకారం, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బృందం ఆకస్మిక దాడి నిర్వహించింది .ఈ దాడిలో అరిగెల్ల చిన్ని, బందెల గోపాల్, ఉప్పరి వీరేశం, ఉప్పరి రమేష్, సాలె రాములు, నాగజోలా రమేష్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.31,433 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన నగదు, మొబైల్ ఫోన్లు మరియు నిందితులను పాపన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐకి అప్పగించి తదుపరి దర్యాప్తు, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, జూదం, పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాలు అనేక కుటుంబాలను నష్టపరుస్తున్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో తప్పుదారులు ఎంచుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేసి సహకరించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# గోడ పత్రికలను ఆవిష్కరించిన పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం :**



అన్నపురెడ్డిపల్లి విద్యావేత్త, హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు శనివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో జరగనున్న మండల అవతరణ దశాబ్ది ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలకు సంబంధించిన గోడ పత్రికలను పిసిసి అధ్యక్షులు ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ ఉత్సవాలను కొనసాగించడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే మండల ప్రజలకు ముందస్తుగా మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, కొమరయ్య, సమన్వయకర్త మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. హరిహర ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వారు అభినందనలు తెలిపారు.

వేద న్యూస్



# పండుగకు ఊరెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి

- దొంగతనాల నివారణకు ముందస్తు చర్యలు అవసరం
- ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వేద న్యూస్, మంచిర్యాల:**



సంక్రాంతి సెలవుల సందర్భంగా జిల్లా ప్రజలు స్వగ్రామాలు, ఇతర పట్టణాలకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో ఇళ్ల భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, ఇవి నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాన్ని కలిగించడంతో పాటు ఏదైనా సంఘటన జరిగితే నిందితులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా నిరంతర పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా నివాస ప్రాంతాలు, అపార్ట్ మెంట్లు, పట్టణాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ, నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇల్లు తాళం వేసి వెళ్లే విషయాన్ని పొరుగువారికి లేదా నమ్మకమైన వ్యక్తికి ముందుగా తెలియజేయాలని, అవసరమైతే సంప్రదింపు ఫోన్ నెంబర్ ఇవ్వడం భద్రతకు దోహదపడుతుందని సూచించారు. రాత్రి వేళల్లో ఇంటి బయట లైట్లు వెలిగేలా టైమర్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందన్న అనుమానం రాకుండా ఉంటుందన్నారు.

# ‘వాణి సాహితి’లో సంక్రాంతి సంబరాలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని వాణి సాహితి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గాలిపటాలు ఎగరవేసి, భోగి మంటలు వేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థుల తల్లులతో ముగ్గుల పోటీలు, చిన్నారులతో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్, గౌరవ అతిథిగా ఉపసర్పంచ్ షేక్ నిస్సార్ ఖాద్రి హాజరయ్యారు. పాఠశాలలో ఇంటి వాతావరణంలా సంక్రాంతి వేడుకలు జరగడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లను పాఠశాల బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోగం నాగరాజు, కరస్పాండెంట్ లోగం సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రివార్డ్ పాయింట్ల పేరుతో మోసాలు

**హైదరాబాద్ వేద న్యూస్ :**

రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. క్రెడిట్ కార్డు రివార్డ్ పాయింట్లు, క్యూపే పాయింట్లు, లాయల్టీ పాయింట్లు అంటూ వస్తున్న సందేశాలు, కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఇటువంటి మోసాల ద్వారా బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులు, క్యూఆర్ కోడ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని పోలీసులు స్పష్టం చేశారు. నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ముఖ్యంగా "రివార్డ్ పాయింట్లు త్వరలో గడువు ముగుస్తాయి" అనే సందేశాలతో ప్రజలను భయపెట్టి లింకులు క్లిక్ చేయిస్తున్నారని తెలిపారు. డబ్బు పోతే తిరిగి పొందలేమని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే నష్టం జరుగుతుందని బెదిరింపులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో ఎలాంటి వివరాలు ఇవ్వకుండా వెంటనే కాల్ కట్ చేయాలని సూచించారు. బ్యాంకులు, అధికారిక సంస్థలు ఎప్పటికీ ఫోన్, సందేశాల ద్వారా వ్యక్తిగత వివరాలు అడగవని గుర్తుంచుకోవాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా సైబర్ క్రైం విభాగాన్ని సంప్రదించాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, జాగ్రత్తే ఉత్తమ రక్షణ అని మరోసారి పోలీసులు గుర్తు చేశారు.




# చిన్నపిల్లల కిడ్నాప్ ముఠా అరెస్ట్

**వరంగల్, వేద న్యూస్ :**



వరంగల్ నగరంలో చిన్నపిల్లల కిడ్నాప్లకు పాల్పడుతున్న ముఠాను కాజీపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ కేసులో కొడుపాక నరేష్ (42), వెల్పుల యాదగిరి (32) అనే ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు పెద్దపల్లి జిల్లా వాసులుగా గుర్తించారు. నేరానికి ఉపయోగించిన ఆధారాలను స్వాధీనం చేసుకుని, విచారణ కొనసాగిస్తున్నారు. ఈ అరెస్టులపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ 28న తెల్లవారుజామున కాజీపేట రైల్వే స్టేషన్ బయట ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కన్నా నాయక్ కుమారుడు, ఐదు నెలల వయసున్న మల్లన్న అనే బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటనలో ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా కాజీపేట, టాస్క్ ఫోర్స్ బృందాలు ఆధారాలను సేకరించాయి. ఈ రోజు ఉదయం అద్దె కారులో మరోసారి చిన్నపిల్లలను కిడ్నాప్ చేయాలనే ఉద్దేశంతో కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో వీరు డిసెంబర్ 28న మల్లన్నను కిడ్నాప్ చేసినదానితో పాటు గతంలో మరో నాలుగు కిడ్నాప్లకు పాల్పడ్డారని ఒప్పుకున్నట్లు చెప్పారు. పిల్లలు కలగలేని దంపతులకు అనాథాశ్రమాల నుంచి తీసుకొచ్చిన పిల్లలని నమ్మబలికి డబ్బులకు అమ్మినట్లు వెల్లడించారు. నిందితుల ఒప్పుకోల ఆధారంగా కాజీపేటలో అపహరణకు గురైన ఐదు నెలల మల్లన్నతో పాటు, గతంలో కిడ్నాప్ చేసిన మరో నలుగురు పిల్లలను పోలీసులు రక్షించారు. చట్టబద్ధ ఆధారాలు లేకుండా పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, కాజీపేట పోలీస్ అధికారులను కమిషనర్ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, ఏసీపీలు మధుసూదన్, ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి జనసేన సిద్ధం..

**హైదరాబాద్ వేద న్యూస్ :**



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని తెలంగాణ ఇంచార్జ్ ఎన్.శంకర్ గౌడ్ తెలిపారు. త్వరలోనే ఎన్నికల కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రతి జనసైనికుడు, వీర మహిళ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్‌పేట డివిజన్ నుంచి డాక్టర్ మాధవ రెడ్డితో పాలు పలువురు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ అంశాన్ని ప్రస్తావించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంలో కీలకమైన జనసేన ఇప్పుడు తెలంగాణపై దృష్టి సారిస్తోంది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏపీలో డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నందున.. పార్టీని విస్తరించాలనుకుంటోంది. అందులో భాగంగానే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి జనసేన సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని తెలంగాణలో ఆ పార్టీ ఇంచార్జి ఎన్.శంకర్ గౌడ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## మానవ అక్రమ రవాణా

# మౌనంగా జరుగుతున్న మానవ హక్కుల హత్య

- ఆశల పేరుతో సాగుతున్న అమానుష వ్యాపారం
- బాధితుల కన్నీళ్లు - వ్యవస్థ వైఫల్యం
- కనిపించని గొలుసుల్లో బంధింపబడుతున్న జీవితాలు
- అవగాహన నుంచి చర్యల వరకు - సమాజం మారాల్సిన దారి

**వేద న్యూస్ డెస్క్:**

మానవ అక్రమ రవాణా అనేది వార్తల్లో అప్పుడప్పుడూ కనిపించే ఒక నేరం మాత్రమే కాదు. అది మన కళ్ల ముందే, మన చుట్టూ, మౌనంగా కొనసాగుతున్న మానవ హక్కుల హత్య. మంచి ఉద్యోగం, మంచి జీవితం, చదువు, పెళ్లి అనే ఆశలతో ఇళ్ల నుంచి బయటకు అడుగుపెట్టిన అనేక మంది చివరికి బానిసలుగా మారుతున్న కఠినమైన నిజం ఇది. మనుషులనే సరుకులుగా చూసే ఈ నేరం, సమాజం ఎంతగా పతనమైందో స్పష్టంగా చూపిస్తోంది. జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం ఈ చీకటి వాస్తవాన్ని మనకు గుర్తు చేయడానికి ఒక సందర్భం మాత్రమే.

గ్రామాల నుంచి పట్టణాలకు, రాష్ట్రాల మధ్య, దేశాల సరిహద్దులు దాటి కూడా మానవ అక్రమ రవాణా విస్తరిస్తోంది. బాల కార్మికులు, లైంగిక దోపిడీకి గురవుతున్న మహిళలు, బలవంతపు శ్రమలో నెట్టబడుతున్న పురుషులూ ఈ జాబితాకు ముగింపు లేదు. ముఖ్యంగా మహిళలు, పిల్లలే ఈ నేరానికి సులభమైన లక్ష్యాలవుతున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని, మంచి జీవితం చూపిస్తామని చెప్పి అక్రమ రవాణా ముఠాలు వలలు వేస్తున్నాయి. ఒక్కసారి ఆ వలలో చిక్కుకున్న తర్వాత, వారి జీవితం పూర్తిగా వారి చేతుల్లో నుంచి జారిపోతుంది.

ఈ సమస్యకు మూలకారణాలు మన సమాజంలోనే దాగి ఉన్నాయి. పేదరికం, నిరుద్యోగం, విద్య లోపం, సామాజిక అసమానతలు ఈ నేరానికి బలమైన పునాది వేస్తున్నాయి. అవకాశాల కోసం తహతహలాడే యువత, కుటుంబ భారం మోయలేక పోరాడే తల్లిదండ్రులు, రక్షణ లేని పిల్లలూ వీరందరూ అక్రమ రవాణా ముఠాలకు సులభమైన లక్ష్యాలవుతున్నారు. ఇదంతా తెలిసినా, "మనకేమిటి" అనే నిర్లక్ష్య ధోరణి సమాజంలో పెరుగుతోంది. అనుమానాస్పద పరిణామాలను గమనించకపోవడం కూడా ఈ నేరానికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తోంది.

బాధితుల పరిస్థితి మరింత హృదయవిదారకంగా ఉంటుంది. వారు శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్రంగా దెబ్బతింటారు. అక్రమ రవాణా నుంచి రక్షించబడిన తర్వాత కూడా వారి పోరాటం ముగియదు. సమాజంలో తిరిగి స్థిరపడటం వారికి పెద్ద సవాలుగా మారుతుంది. అనుమాన దృష్టి, అపహాస్యం, అవమానం వారిని వెంటాడుతూనే ఉంటాయి. బాధితులను నేరస్తుల్లా చూసే ధోరణి, వారిని మరింత ఒంటరిగా మారుస్తోంది. నిజానికి వారు నేరస్తులు కాదు, వారు వ్యవస్థ వైఫల్యానికి బలైన బాధితులు.

చట్టాలు ఉన్నాయని చెప్పుకోవచ్చు. కానీ అమలులో ఉన్న లోపాలు ఈ నేరాన్ని పూర్తిగా అరికట్టలేకపోతున్నాయి. అక్రమ రవాణా ముఠాలు కాలానికి అనుగుణంగా మారుతుంటే, వ్యవస్థలు మాత్రం అదే పాత విధానాల్లోనే నడుస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాధితులకు పునరావాసం, ఉపాధి, భద్రత కల్పించడంలో స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నాయి. ఈ లోపాలే కొందరిని మళ్లీ అదే చీకటి జీవితంలోకి నెట్టేస్తున్నాయి. ఇది కేవలం చట్టపరమైన సమస్య కాదు, ఇది సామాజిక బాధ్యతా వైఫల్యం.

అవగాహన లేకుండా ఈ నేరంపై పోరాటం సాధ్యం కాదు. గ్రామస్థాయిలో మొదలుకొని పట్టణాల వరకు, పాఠశాలల నుంచి కార్యాలయాల వరకు ప్రతి ఒక్కరికీ మానవ అక్రమ రవాణా ప్రమాదాలపై అవగాహన అవసరం. అతి ఆకర్షణీయమైన ఉద్యోగ ఆఫర్లు, అనుమానాస్పద మధ్యవర్తులు, చట్టబద్ధత లేని హామీలు ఎంత ప్రమాదకరమో ప్రజలు తెలుసుకోవాలి. అలాగే బాధితుల హక్కులు ఏమిటి, వారికి చట్టపరంగా ఎలాంటి రక్షణ ఉందో కూడా స్పష్టంగా తెలియాలి. బాధితుల పట్ల సానుభూతి, మానవత్వం పెరిగినప్పుడే ఈ నేరంపై నిజమైన పోరాటం మొదలవుతుంది.

జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం ఒక రోజు కార్యక్రమంగా పరిమితం కాకూడదు. ఇది మనల్ని మనమే ప్రశ్నించుకునే దినంగా మారాలి. మన చుట్టూ ఎక్కడైనా ఈ నేరం జరుగుతోందా? మనం దాన్ని గుర్తించగలుగుతున్నామా? ఒక పౌరుడిగా మన బాధ్యత ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడం నుంచే మార్పు ప్రారంభమవుతుంది. మనిషి విలువను కాపాడుకోవాలంటే, మనుషుల్ని సరుకులుగా మార్చే ఈ అమానుష నేరంపై సమాజం మొత్తం ఏకమై నిలబడాల్సిందే. అవగాహన, జాగ్రత్త, మానవత్వం -- ఇవే మానవ అక్రమ రవాణాపై గెలిచే నిజమైన ఆయుధాలు.

# జలమండలి భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ వేద న్యూస్ :**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి గ్రామం సర్వే నంబరు 388లో జల మండలికి చెందిన 4.01 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. ఈ భూమిని జల మండలి అవసరాల నిమిత్తం ప్రభుత్వం కేటాయించగా, స్వాధీనం ప్రక్రియలో స్థానికుల నుంచి ఆటంకాలు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుంటూ సమస్యలు సృష్టించడంతో జలమండలి అధికారులు హైడ్రా సహాయాన్ని కోరారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, ఈ భూమి హైదరాబాద్ మహానగర జల సరఫరా మరియు మురుగు పారుదల మండలికి ప్రభుత్వంగా కేటాయించినదేనని నిర్ధారించింది. ఈ మేరకు శనివారం 4.01 ఎకరాల జలమండలి భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భూమి జలమండలికి చెందిందని స్పష్టంగా తెలియజేస్తూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు. జల సరఫరా అవసరాలకు కీలకమైన భూమిని కాపాడటంతో భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# సంక్రాంతి ఊరిబాట పట్టిన జనం..

**హైదరాబాద్ వేద న్యూస్ :**



సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్లే జనాలతో హైదరాబాద్ నగరంలోని బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిసి పోయాయి. జనం రద్దీతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. అటు జాతీయ రహదారులపై కూడా వాహనాల రద్దీ నెలకొన్నది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు బారులుతీరాయి. సంక్రాంతి నేపథ్యంలో రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎక్కడికక్కడ పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. సూర్యాపేటలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో హైవేపై ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. వాహనాలు క్రమ పద్ధతిలో వెళ్లేలా చూస్తున్నారు. ఎక్కడైనా అవాంతరాలు ఏర్పడితే వెంటనే ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిద్ధంగా ఉన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073